క్లుప్తంగా

పొదుపు మహిళల ఖాతాలకు ఆసరా నిధులు

సీతానగరం: పొదుపు మహిళల ఖాతాలకు వైఎస్సార్ ఆసరా నిధులను ప్రభుత్వం జమ చేసిందని వెలుగు మండల సమాఖ్య ప్రతినిధి జి.ప్రమీల గురువారం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కాశీపేట గ్రామానికి చెందిన ఒక పొదుపు సంఘానికి, చినభోగిలిలో ఒకటి, సూరంపేట పంచాయతీలో రెండు, నిడగల్లులో మూడు, సీతానగరంలో 11, కోట సీతారాంపురంలో ఒకటి, జానుమల్లువలసలో ఒక సంఘానికి సైతం ఆసరా నిధులు జమైనట్టు వెల్లడించారు. సంబంధిత సభ్యులు బ్యాంకు ఖాతాలను సరి చూసుకోవాలని కోరారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలకరణలో లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: సువర్ణ ముఖీ నదీతీరాన వెలసిన లక్ష్మీనృసింహస్వామి వారిని వందలాది మంది భక్తులు గురువారం దర్శించారు. స్వామి వారికి ప్రతీకరమైన రోజు కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తొమ్మిది వారాల పాటు స్వామివారిని దర్శించుకున్నవారికి సంతాన, గృహదోషాలు తొలగుతాయని భక్తులు విశ్వసిస్తారని అర్చకుడు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నసంతర్పణ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీఓ పి.దేవకుమార్ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

దివ్యాంగుల 'భవిత' కోసం..



దివ్యాంగ చిన్నారులతో ఎంఈఓ సత్యనారాయణ

మక్కువ: భవిత కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి ఉజ్వల భవిష్యత్ కల్పించేందుకు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నామని ఎంఈఓ పెంట సత్యనారాయణ గురువారం తెలిపారు. వివిధ గ్రామాల్లో గుర్తించిన పిల్లలను మండల కేంద్రంలోని భవిత కేంద్రం ఉపాధ్యాయులు శైలజ, రవికుమార్ సమక్షంలో చేర్పించారు. దివ్యాంగులను భవిత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యాబుద్ధులతో పాటు ప్రత్యేక అలవెన్స్‌లు అందిస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ ఈశ్వరమ్మ

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ బోరింగువలస గ్రామం నుంచి మెట్టవలస గ్రామం వరకు ఉపాధి హామీ పథకం నిధులతో జరుగుతున్న రోడ్డు పనులను ఏపీఓ శంబంగి ఈశ్వరమ్మ గురువారం పరిశీలించారు. అలాగే, దబ్బగెడ్డ గ్రామంలో ఉపాధిహామీ వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేతనం గిట్టుబాటయ్యేలా పనులు చేయాలని సూచించారు.

వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వెంకంపేట గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: వెంకంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన 60 మందికి డాక్టర్ శ్రీకాంత్ వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ప్రిజమ్ - 10'

సీతంపేట: ప్రిజమ్ – 10 కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గర్భిణీనీ పర్యవేక్షించడంతో పాటు రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మాతా,శిశు మరణాలు అరికట్టడానికి కృషి చేయాలని ఆదేశించారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష



వెంకంపేట గ్రామంలో భూసార పరీక్షలకు మట్టినమూనాను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- నేల భౌతిక లక్షణాలను తెలుసుకునే అవకాశం

పార్వతీపురంటౌన్:

వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకోవాలి. వాటిని భర్తీచేసి పంటలు సాగు చేయాలి. వీటికి భూసార పరీక్షలు దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వినియోగిస్తుండడంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారుతోంది. చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకేందుకు అవకాశం కలుగుతుందన్నది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల మాట.

భూ సార పరీక్షకు మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- పంట కోత పూర్తయిన తరువాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి. పొలాలకు సాగు నీరు పెట్టినపుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలు సేకరించ కూడదు.
- పొలాల్లో నీడపడే ప్రదేశాలు, చేలగట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసేయాలి. వరి పొలంలో 'వి' ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపొర నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాలో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తరువాత పాలథిన్ కవర్ నింపి రైతుల వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగుచేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత (ఎలక్ట్రికల్ కండక్టవిటీ), నేల ఆమ్ల, క్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



భూ సార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. గతేడాది నిర్వహించిన భూసార పరీక్షల్లో పలు గ్రామాల్లో భూమిలో వరి పంటకు అవసరమైన భాస్వరం ఎక్కువ మోతాదులో ఉన్నట్టు గుర్తించారు. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

– ఎం.అశోక్, మండల వ్యవసాయాధికారి, పార్వతీపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



సుబద్ర గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్, ఎస్ఐ పాపారావు

బలిజిపేట/సీతానగరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ సమీపిస్తుండడంతో పోలీసులు భద్రత చర్యలను ముమ్మరం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పల్లెలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. శాంతియుతంగా మెలగాలని సూచిస్తున్నారు. అల్లర్లకు పాల్పడేవారిపై తీసుకునే చర్యలను వివరిస్తున్నారు. వివాదాల్లో చిక్కుకోవద్దని హితవుపలుకుతున్నారు. బలిజిపేట మండలంలోని మిర్తివలస, బర్లి, సుబద్ర, చిలకలపల్లి గ్రామాల్లో సీఐ రవికుమార్ గురువారం పర్యటించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత గ్రామాల్లో ఊరేగింపులు, ర్యాలీలు, బాణాసంచాలు కాల్చడం వంటివి నిషేధమని స్పష్టం చేశారు. ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కలిగించి, అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.



బగ్గందొరవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఎం.రాజేష్

- సీతానగరం మండలంలోని బగ్గందొరవలస, బల్లకృష్ణాపురం, తామరఖండి గ్రామాల్లో ఎస్ఐ ఎం.రాజేష్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలోని ఆటోనగర్ సబ్‌స్టేషన్, పాచిపెంట మండలం గురివినాయుడుపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ (ఆపరేషన్స్) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.వి.కిషోర్ తెలిపారు. ఫీడర్ల మరమ్మతు పనుల్లో భాగంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఆటోనగర్, శ్రీనివాసకాలనీ, గాంధీనగర్, శివాలయం రోడ్డు, దాసరి వీధి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మజ్జులపేట, బంగారమ్మకాలనీ, రామాకాలనీ, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామంలో సైబర్ నేరాలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఎస్ఐ ఎం.వి.రమణ ప్రస్తుత కాలంలో జరుగుతున్న చోరీలు, దోపిడీలు, సైబర్ నేరాలను వివరించి, వాటి బారినపడకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అనీష్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖరాజు

జియ్యమ్మవలస: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, ప్రతీ రైతు ఖరీఫ్ పనులకు ముందే నవధాన్యాలు పొలంలో వేసుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని బిత్రపాడు గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద నవధాన్యాల కిట్లు రైతులకు గురువారం పంపిణీ చేశారు. నవధాన్యాలు పొలంలో వేసి, మొక్కలైన తర్వాత వాటిని అదే పొలంలోనే కలియదున్నాలని, ఇలా చేస్తే ప్రధాన పంటకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అంది, మంచి దిగుబడి వస్తుందన్నారు. ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, వీఏఏ శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

పాలకొండ రూరల్: ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎన్ని వాహిని తెలిపారు. ఓని, వాటపాగు, తంపటాపల్లి సచివాలయాల పరిధిలోని సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

పిల్లలూ జర జాగ్రత్త!

- సరదాగా ఈతకు వెళ్లి, ప్రమాదం బారినపడుతున్న పిల్లలు
- జాగ్రత్త వహించకపోతే ప్రమాదమని హెచ్చరిస్తున్న పెద్దలు
- ఇంటి వద్దనే స్నానం చేసుకునేలా చూడాలని సూచన



సాగునీటి కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

గరుగుబిల్లి: వేసవి సెలవుల్లో చాలామంది పిల్లలు నదులు, చెరువులు, కాలువల్లో స్నానానికి వెళ్లి, ఈత కొట్టేందుకు ఇష్టపడుతుంటారు. అయితే ఒక్కోసారి నీటిలోతు తెలియక కొంతమంది, ఈతరాక మరి కొంతమంది ప్రమాదం కొని తెచ్చుకుంటున్నారు. ఈత సరదాలో తమను తాము మర్చిపోయి మెల్ల మెల్లగా లోతైన ప్రదేశానికి వెళ్లి, మునిగిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లేకపోతే ప్రమాదం తప్పదని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర ఆటలు ఆడకుండా, నదీతీర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచిస్తున్నారు. ఈత సరదా కోసం వెళ్లే పిల్లలు ఒంటరిగా వెళ్లకూడదని, పెద్దలను వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు కూడా అధికంగా ఉండడంతో వీలైనంత వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా చూడాలంటున్నారు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న వేళల్లో మాత్రమే వారిని ఆడుకునేందుకు ఆరుబయటకు పంపించాలంటున్నారు. ఎండల బారినపడితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, నిమ్మరసం, గ్లూకోజ్, కొబ్బరికాయ నీరు తరచూ పిల్లలకు ఇవ్వాలని చెబుతున్నారు.

పిల్లలకు చెప్పాల్సిన జాగ్రత్తలు..

- ఎండలలో వీలైనంతవరకు తిరగకూడదు. అవసరమైతే తప్ప బయటకు పంపించొద్దు. ఎక్కువ సమయం ఇంట్లోనే విశ్రాంతి తీసుకోనివ్వండి.
- తల్లిదండ్రులు కూడా పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఖాళీ సమయంలో పిల్లలతో విజ్ఞానం, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివించాలి.
- చెస్, క్యారంబోర్డు, పజి ల్స్, పరమపదసోపానం వంటి ఆటలు ఆడేలా చూడాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులకు పిల్లలు సమాచారం ఇవ్వడాన్ని అలవాటు చేయాలి.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



బలిజిపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్యనుంచి అధికగమించవచ్చని ఎంపీడీఓ రమేష్‌నాయుడు అన్నారు. ప్రిజం కార్యక్రమంలో భాగంగా బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, సీడీపీఓ, సచివాలయ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృశిశు మరణాలకు ప్రధాన కారణమైన రక్తహీనత సమస్యను అధిగమించేలా గర్భిణులకు పౌష్టికాహారం, వైద్యసేవలు అందించాలని సూచించారు. తలనొప్పి తరచుగా రావడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వంటివి రక్తహీనతకు సంకేతాలుగా పేర్కొన్నారు. రక్తహీనత నివారణకు వైద్యులు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త హీనతను నివారిద్దాం



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అఖీబ్ జావేద్

పార్వతీపురం టౌన్: అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి రక్తహీనత సమస్యను అధిగమించాలని ఎంపీడీఓ అఖీబ్ జావేద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్వతీపురం మండల స్థాయి వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో గర్భిణుల్లో రక్తహీనత నివారణ, మాతాశిశు సంక్షేమ చర్యలు, ఆస్పత్రి ప్రసవాలు, 108 వాహన సేవలపై సమీక్షించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వాస్పత్రులకు ఆధునిక సదుపాయాలు కల్పించిందని, నిపుణులైన వైద్యులను నియమించిందని, సేవలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణులు ఆస్పత్రుల్లో ప్రసవించేలా అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లకు సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం సురేష్, పీహెచ్‌సీ డాక్టర్లు ధరణి, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: మాతాశిశు మరణాల నివారణకు ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు సూచించారు. పల్లెల్లో హైరిస్క్ గర్భిణులను గుర్తించి పౌష్టికాహారం అందజేయడంతో పాటు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ డాక్టర్ డి.పావని అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని వైద్య సిబ్బందిని కోరారు. వైద్యాధికారులు పావని, ప్రభుదేవ్ మాట్లాడుతూ గర్భిణులకు నెలనెలా వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి పూర్ణిమ, పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్.వి.రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ, సత్యవతి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఆర్వో



పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో విష్ణుచరణ్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌ను సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ గురువారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులతో మాట్లాడారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ తదితర సర్వీస్ పోస్టల్ బ్యాలెట్‌లు 385 గాను ఇప్పటివరకు 132 వచ్చాయని, ఏ రోజు వచ్చిన వాటిని ఆ రోజు భద్రపరుస్తున్నామని ఆర్వో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు



కళాశాలను పరిశీలిస్తున్న పీఎం-ఉష ఇంజినీర్ల బృందం

పార్వతీపురంటౌన్: శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పీఎం ఉష పథకం కింద రూ. 5 కోట్లు మంజూరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు పీఎం–ఉష టీమ్ ఇంజినీర్ల బృందం కళాశాలను గురువారం పరిశీలించింది. కళాశాలలోని అన్ని తరగతి గదులు, ఆటస్థలం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. కళాశాలలో వసతి గృహ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

విజృంభిస్తున్న జ్వరాలు



ఇన్‌పేషెంట్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: అధిక ఉష్ణోగ్రతల వల్ల మన్యంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ జ్వరపీడితుల సంఖ్య ఎక్కువ కావడంతో ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ ప్రాంత రోగులంతా సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేపట్టి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

ఆలోచనలకు పదును పెట్టాలి



పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఖాళీ సమయాల్లో తమ ఆలోచనలకు పదునుపెట్టాలని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యర్థాలతో బొమ్మలు, కళాకృతులు తయారు చేయు విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి,విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బబ్బూరి గణేష్‌బాబు, ఉపాధ్యాయుడు రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్కారం

వీరఘట్టం: సూర్య సిద్ధాంతం ఆధారంగా పంచాంగం రూపొందించిన శ్రీకాకుళం జిల్లా కొండవలస గ్రామానికి చెందిన పంచాంగకర్త సుబ్రహ్మణ్య శర్మను వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ గురువారం ఘనంగా సన్మానించారు. వీరఘట్టంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శర్మయాజీ మాట్లాడుతూ, సుబ్రహ్మణ్యశర్మ గొప్పతనాన్ని వివరించారు.